## నేటి ప్రజావాణి రద్దు

భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, జనవరి 19 : భూపాలపల్లితోపాటు ములుగు జిల్లాల్లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయా కలెక్టర్లు రాహుల్ శర్మ, టీఎస్ దివాకర ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అధికారులందరూ ప్రజా సంక్షేమ పథకాల సర్వేలో ఉన్నందున గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విషయాన్ని గ్రహించి ప్రజలు కలెక్టర్ కార్యాలయాలకు రావొద్దని సూచించారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు

ములుగురూరల్, జనవరి19 : అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులను అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అధికారులపై అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని, గతంలో దరఖాస్తు చేసుకోని వారి నుంచి సైతం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వివరించారు.

## దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్, జనవరి 19 : భూపాలపల్లి 9, 10, 17, 22, 29వ వార్డుల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ పథకాల కోసం ప్రజల నుంచి అధికారులు ఆదివారం దరఖాస్తులు స్వీకరించారు. గతంలో నిర్వహించిన ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోనివారు అప్లికేషన్లు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్ రవీందర్, మండ సంపత్, ఎస్కే పాషా, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, వార్డు ఆఫీసర్లు శ్రీనివాస్, కర్ణాకర్, శ్రీకాంత్, రాజేశ్వరి పాల్గొన్నారు.

## కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

టేకుమట్ల, జనవరి 19 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ(తాత్కాలిక పద్ధతి) పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, పీజీ పూర్తిచేసిన మహిళా అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 20, 21 తేదీల్లో టేకుమట్లలోని కేజీబీవీలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## నేడు ఉపాధ్యాయుల నిరసన

భూపాలపల్లి రూరల్, జనవరి 19 : విద్యా సంస్థల్లో మతోన్మాద శక్తుల జోక్యాన్ని నిరసిస్తూ సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై అయ్యప్ప మాల ధరించిన మతోన్మాద శక్తులు చేసిన దాడికి వ్యతిరేకంగా ఇటీవల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాలు పాల్గొని, నిరసన తెలపాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సోమవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ 60 రకాల వెజ్ & నాన్‌వెజ్ పచ్చళ్ళు కిరాణా షాపులకు, క్రీపాయింట్లకు, బేకరీషాపులకు, హోటల్స్‌లకు సప్లై చేయడానికి బైక్ కలిగిన యువకులు మండలానికి ఒకరు కావలెను. సెల్ : 8143909459
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- పలు గ్రామాల్లో సర్వే పరిశీలన


చిట్యాల : అధికారులతో మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ


రేగొండ : జగ్గయ్యపేటలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

చిట్యాల/మొగుళ్లపల్లి/రేగొండ/మల్హర్, జనవరి 19 : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఆదివారం ఆయన చిట్యాల మండలంలోని లక్ష్మీపూర్ తండా, తిరుమలాపూర్ గ్రామాలతో పాటు మొగుళ్లపల్లి మండలంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సర్వే పకడ్బందీగా నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. తప్పిదాలు జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సూచించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలకు ఏర్పాట్లు చేయాలన్నారు. 26 నుంచి ప్రజల అభిప్రాయలు తీసుకోవడంతో పాటు కొత్తగా తీసుకున్న దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట చిట్యాలలో తహసీల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, ఆర్ఐ రాజు, ఏఈవో రమణ కుమార్, మొగుళ్లపల్లిలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, ఏవో సురేందర్ రెడ్డి, ఏఈవో జోత్స్న పంచాయతీ కార్యదర్శి నరేశ్ తదితరులు ఉన్నారు. అలాగే, రేగొండ మండలంలోని లింగాల, గోరికొత్తపల్లి మండలం జగ్గయ్యపేటలో జరిగిన సర్వేను అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, మండల ప్రత్యేక అధికారి సునీల్, తహసీల్దార్ శ్వేత తదితరులు ఉన్నారు. మల్హర్ మండలం తాడిచర్లలో జరుగుతున్న సర్వేను కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రవి కుమార్ సిబ్బంది ఉన్నారు.

**అర్హులైన వారిని ఎంపిక చేయాలి**

చిట్యాల/గణపురం, జనవరి 19 : ప్రభుత్వ పథకాల్లో అర్హులైన లబ్ధిదారులనే ఎంపిక చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. చిట్యాల మండలంలోని లక్ష్మీపూర్ తండ శివారు చెంచుపల్లిలో సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు సక్రమంగా సర్వే నిర్వర్తించకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేలో అలసత్వం, తప్పిదాలు జరిగితే సహించేది లేదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హేమ, ఆర్ఐ రాజు తదితరులు ఉన్నారు. అలాగే, గణపురం మండలంలోని గాంధీనగర్‌లో జరుగుతున్న సర్వేను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, మండల ప్రత్యేక అధికారి అసోద కుమారస్వామి, తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, ఆర్ఐ రహమద్ పాషా, జూనియర్ అసిస్టెంట్ మేరుగు అశోక్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్, సర్వేయర్ నిరంజన్ ఉన్నారు.

**గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే**

మహదేవపూర్(కాళేశ్వరం)/కాటారం/కన్నాయిగూడెం : గ్రామాల్లో ప్రభుత్వ పథకాల సర్వే కొనసాగుతోంది. మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు పల్గుల అంబట్‌పల్లి, కాళేశ్వరం, అన్నారం, బొమ్మాపూర్, బెగ్లూర్ తదితర గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. జీపీ కార్యదర్శులు అంగోత్ సమ్మయ్య, రమేశ్, దామోదర్‌రెడ్డి, అంజలిరెడ్డి, సతీశ్, సృజన్, సత్యనారాయణ, గాయత్రి, కల్పన పాల్గొన్నారు. అలాగే, కాటారంలో నిర్వహించిన సర్వేను తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, కరుణాకర్, ఏఈవోలు పాల్గొన్నారు. కన్నాయిగూడెం మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల్లో రైతు భరోసా సర్వే పూర్తి చేసినట్లు ఏవో అధికారి మహేశ్ తెలిపారు. గ్రామాల్లోని 42 సర్వే నెంబర్లలో 53 ఎకరాల పట్టా భూములు వ్యవసాయ యోగ్యంగా లేనట్లు గుర్తించారు. సర్వేలో తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ గణేశ్, ఏఈవో కల్యాణి, సిబ్బంది బలరాం, పురుషోత్తం, ప్రశాంత్ పాల్గొన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్నగండ్ర వెంకటరమణారెడ్డి

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ

చిట్యాల/రేగొండ, జనవరి 19 : బీఆర్‌ఎస్ పార్టీ చిట్యాల టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ గౌడ్ కుమార్తె నవ్య ఆదివారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే మండల కేంద్రానికి చెందిన ముస్కాపూరి లక్ష్మి, పెరుమండ్ల జగన్, జూకల్ గ్రామానికి చెందిన మొలుగూరి సారమ్మ , చిదిరాల వెంకట్‌రెడ్డి ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా వారి ఇళ్ల వద్దకు కూడా వెళ్లి బాధితులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, యూత్ మండల అధ్యక్షుడు టౌటం నవీన్, నాయకులు ఏరుకొండ రాజేందర్, పుట్టపాక మహేందర్, జంబుల తిరుపతి, ఆనంద్ రెడ్డి, కొడారి రవి, పిట్ట సురేశ్, దామెర రాజు, పెరుమండ్ల రవీందర్, ఏలేటి రాజు, మర్రి నరేశ్, అన్న శ్రీను, తాటిపెల్లి శ్రీను ఉన్నారు. అలాగే, రేగొండ మండలం కొత్తపల్లి(బీ) గ్రామానికి చెందిన ఆడుప కొంరయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు ఇంగే మహేందర్ గోపాల్‌రావు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు


## బాధిత కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

మహదేవపూర్,జనవరి 19 : మండల కేంద్రానికి చెందిన కేదారి లలితా బాయి మృతిచెందగా ఆదివారం జరిగిన ప్రథమ వర్ధంతిలో బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేశ్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, మాజీ సర్పంచ్ బాపు, మండల యూత్ అధ్యక్షుడు అలీం, నాయకులు ప్రకాశ్, రమేశ్, బాపురావు, రెవెల్లి రాజశేఖర్, మనోజ్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి, జనవరి 19 : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని, వాటి యజమానులైన పులి రాజేందర్, ఈర్ల రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని పోతుగల్లు పెద్ద వాగు నుంచి కొర్కిశాల గ్రామానికి టేకుమట్ల మండలం రామకృష్ణపురం గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్న క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ములుగురూరల్, జనవరి 19 : ములుగులోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన అధ్యాపకుడు నూనె రవీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆదివారం పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. రూ.1.85లక్షలు అందజేశారు. ముందుగా రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సాంబయ్య, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, విద్యాసాగర్, పూర్వ విద్యార్థులు యాసం రాజ్‌కుమార్, వంగల వేణు, మహమ్మద్ చాంద్‌పాష, రఫిక్, సంతోశ్, ప్రభాకర్, రజిని పాల్గొన్నారు.

**డ్రైవర్ కుటుంబానికి..**

గణపురం : సింగరేణి ఓసీ-త్రీలో ఇటీవల వాల్వో ట్రక్ ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ అన్వర్ పాషా కుటుంబానికి ఆదివారం మూడు షిఫ్టుల ట్రక్ డ్రైవర్లు రూ.86 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఓసీ త్రీ యూనియన్ అధ్యక్షుడు మాచర్ల కనకయ్య, రవి, దేవేందర్, బాలకృష్ణ, సురేందర్, అశోక్, శశికుమార్, సతీశ్, సందీప్, సురేశ్‌కుమార్‌రెడ్డి, యాకూబ్, ఉపేందర్, దీపక్ పటేల్ పాల్గొన్నారు.

# సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

గణపురం,జనవరి 19: సింగరేణి ప్రభావిత నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని, అందులో భాగంగానే సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపుల నిర్వహణ అభినందనీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని నగరంపల్లి గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సింగరేణి ఏసీఎంవో డాక్టర్ పద్మజ, తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో ఎల్ భాస్కర్, ఎంఈవో ఊరుగొండ ఉప్పలయ్య, పర్సనల్ మేనేజర్ వీకే మారుతి, ఏజీఎంఐ ఈడీ జ్యోతి, డీజీఎం(సివిల్) రవి కుమార్, ఓసీపీ త్రీ గని మేనేజర్ భానుప్రసాద్, ఏఐటీయూసీ నాయకుడు విజేందర్, ఐఎన్‌టీయూసీ నాయకుడు మధుకర్ రెడ్డి, సింగరేణి సీఎంవోఏఐ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, సింగరేణి ఎస్వోటూ జీఎం ఎస్ రవీంద్ర, ఓసీపీ త్రీ ప్రాజెక్టు ఆఫీసర్ భిక్షమయ్య, వెల్ఫేర్ ఆఫీసర్లు సాయి కృష్ణ, కిశోర్, సింగరేణి డాక్టర్లు, సిబ్బంది, సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్ పాల్గొన్నారు.


గణపురం : శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**సీఎంఆర్‌ఎఫ్ అందజేత**

భూపాలపల్లి రూరల్ : పట్టణంలోని మంజూర్‌నగర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 32 మంది లబ్ధిదారులకు రూ.8,04లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందజేశారు. ఆపదలో సీఎం సహాయ నిధి ఆదుకుంటుందన్నారు. బాధితులు అవసరమైన సమయంలో దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి బైక్ బోల్తా

**ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు**

మహదేవపూర్, జనవరి 19 : బైక్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన ఘటన మహారాష్ట్రలోని చింతలపల్లి లో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రహీం(21), అమాన్ జాబ్రీ(20) బైక్‌పై మహారాష్ట్రలోని సిరొంచలో ఉర్సుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో చింతలపల్లి వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని మహదేవపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు వైద్యులు తరలించారు.

## గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

వాజేడు, జనవరి 19 : గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు వాజేడు ఎస్సై ఎన్ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మండపాకలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో గ్రామంలో సోదాలు చేయగా కవిరి సారయ్య ఇంట్లో 40 లీటర్ల గుడుంబా దొరికనట్లు పేర్కొన్నారు. దీంతో అతడిపై కేస్ నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై లతీఫ్, హరిప్రసాద్, తిరుపతి, జనార్దన్ పాల్గొన్నారు.

**సరఫరా చేస్తున్న మహిళపై..**

ఏటూరునాగారం : గుడుంబా సరఫరా చేస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. గోవిందరావుపేట మండలం దుంపెల్లిగూడెం సమీపంలోని రాంనగర్ గ్రామానికి చెందిన జరుపుల మమత బస్సులో గుడుంబాను కవర్లలో తీసుకొవచ్చి మండల కేంద్రంలోని శివాలయం వీధిలో సరఫరా చేస్తుండగా పట్టుకుని, 20 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మేడారం నుంచి బెల్లం తరలించి గుడుంబా తయారు చేస్తున్నట్లు విచారణ తేలిందని తెలిపారు.

## బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

ఏటూరునాగారం, జనవరి 19 : సంక్రాంతి పండుగకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి, తిరిగి వెళుతున్న వారితో స్థానిక బస్టాండ్ కిటకిటలాడుతోంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తూ ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం హనుమకొండ, హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు అధిక సంఖ్యలో రావడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్న విద్యార్థులు అవస్థలు పడ్డారు. అవసరమైన మేరకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అలాగే, బస్టాండు సరిపోకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే వేచి ఉండాల్సి వచ్చింది.

## సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 19 : భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు చేయాలని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బీఎంఎస్ కేంద్ర కార్యవర్గ సమావేశం యాదగిరి సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిసిన విద్యుత్ బొగ్గు బకాయిలు సుమారు రూ.33వేల కోట్లు వెంటనే సింగరేణి పరిశ్రమకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువతి ఆత్మహత్య


చిట్యాల, జనవరి 19 : మనస్తాపంతో యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బుర్ర నవ్య(20)ను మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన సిద్ధు అనే యువకుడు ప్రేమ పేరుతో వేధించి సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టేవాడు. ఈ విషయంపై నవ్య తండ్రి బుర్ర శ్రీధర్ గతంలోనే ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అయినా సోషల్ మీడియాలో ఫొటోలు పెడుతుండడంతో మనస్తాపం చెందిన యువతి ఆదివారం తెల్లవారుజామున చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సివిల్ దవాఖానకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉరి వేసుకునే ముందే ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మొగుళ్లపల్లి, జనవరి 19 : మండల పరిధిలోని రంగాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో 1999-2000 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత మిత్రులు ఒక్క చోట కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రవీందర్, తిరుపతిరెడ్డి, గణపతిరెడ్డి, వెంకటరాజం, రాజిరెడ్డి, సత్యనారాయణ, సాంబయ్య, రంగారావు పాల్గొని మాట్లాడారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆడి పాడి సందడి చేశారు

**గోవిందరావుపేటలో..**

గోవిందరావుపేట : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉనత్న పాఠశాలలో 1989-90 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. నాటి గురువులు శ్రీనివాసరావు, వీరయ్య, వెంకటరెడ్డితో పాటు హెచ్‌ఎం సోమారెడ్డి, అటెండర్లు రామదాసు, షరీఫ్, వెంకటయ్యను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి సహకరించిన గుత్తికొండ ప్రసాద్, పాలడుగు కిశోర్, పల్లెపాటి నమ్మిరెడ్డిని కూడా సన్మానించారు. అనడం సురేశ్, పాడియా గంగు, రంజాన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి : ఆత్మీయ సమ్మేళనంలో మిత్రులు


గోవిందరావుపేట : పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర

## చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన

వెంకటాపూర్, జనవరి 19 : మండలంలోని భూర్గుపేట పరిధి మారేడుగొండ చెరువు శాశ్వత మరమ్మతు పనులకు ఆదివారం మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లడుతూ నాణ్యత ప్రమాణాలతో చెరువు శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లక్ష్మీదేవిపేట- భూర్గుపేట గ్రామాల మధ్యలో మారేడగొండ చెరువు మరమ్మతు పనులకు రూ.2.86కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం అకాల వర్షాలతో మారేడుగొండ చెరువు కట్ట పూర్తిగా తెగి ప్రాణనష్టంతో పాటు పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలతో పనులు చేయాలని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షకాలంలోపు పనులు పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ దివాకర, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పైడాకుల అశోక్, ఏటూరునాగారం ఏఎస్పీ పాల్గొన్నారు.


టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ నూతన కమిటీ సభ్యులు

## టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ నూతన కమిటీ నియామకం

భూపాలపల్లి రూరల్, జనవరి 19 : సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ముందంజలో ఉంటుందని భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అన్నారు. భూపాలపల్లిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో 50 మందితో నూతన బ్రాంచ్ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య మాట్లాడుతూ బ్రాంచి కమిటీ సభ్యులంతా కార్మికుల సమస్యలపై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సదానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరకొండ మధు, బ్రాంచ్ కార్యదర్శులు భాషనపెల్లి కుమార్, జీ రాంచందర్, వెంకట్రాజం, బీ నరేందర్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి చీకటి వంశీ, ఏరియా అధికార ప్రతినిధి సుంకరి గోవర్ధన్, బ్రాంచ్ కమిటీ నాయకులు, వివిధ గనుల ఫిట్ సెక్రటరీలు నరేశ్ నేత, రాజేందర్, బద్దెల వంశీ, నాయకులు రవితేజ, టీ తిరుపతి, బీ కిషన్ నాయక్, రమణారెడ్డి, కన్నా త్రివేది, వనం అనిల్, లింగాల ప్రవీణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్

## యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

కృష్ణ కాలనీ, జనవరి 19 : యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని భూపాలపల్లి సీఐ డీ నరేశ్ కుమార్ సూచించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భూపాలపల్లిలోని మినీ ఫంక్షన్ హాల్‌లో 5వ రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి నరేశ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండపర్తి రవీంద్రాచారి మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలకు వివిధ జిల్లాల నుంచి 150 టీంలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు శివసాగర్, శ్రీకాంత్, శ్రీను, రాజు, రమేశ్ పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న కళాకారులు

## జిల్లా స్థాయి నృత్య పోటీలు

కృష్ణ కాలనీ, జనవరి 19 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన డ్యాన్సర్లు ప్రణయ్, బాలు స్మారకార్థం జిల్లా డాన్స్ మాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో ఆదివారం జిల్లాస్థాయి డ్యాన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డ్యాన్స్ మాస్టర్లు రాజేశ్, సుధాకర్ మాట్లాడుతూ మృతి చెందిన డ్యాన్సర్లను స్మరించుకొని జిల్లా స్థాయి పోటీలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీల వల్ల జిల్లాలోని కళాకారుల మధ్య స్నేహబంధాలు పెరుగుతాయన్నారు. అనంతరం జిల్లా కాంపిటీషన్లలో గెలుపొందిన డ్యాన్సర్లకు ప్రశంసా పత్రాలతో పాటు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్లు రమేశ్, నరేశ్, గణేశ్, కల్యాణ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుతో ఎస్సై తిరుపతిరావు

## యువత క్రీడా స్ఫూర్తి చాటాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 19 : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుతూ గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. కాఫెడ్ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్సై ముఖ్యఅతిథిగా హాజరై విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు అశోక్, సన్నీ, శివ పాల్గొన్నారు.

## యువతిని వేధించిన యువకుడిపై కేసు

ములుగురూరల్, జనవరి 19 : ములుగు జిల్లాకు చెందిన ఓ యువతిని వేధించిన ఘటనలో యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన వసీం అక్రమ్ ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసి పెండ్లికి మొహం చాటేయడంతో పాటు వేధింపులకు గురి చేశాడు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.